# 12

గుమ్మం బయట నిలబడి తల మాత్రం కనిపించేట్లు లోపలకి చూస్తూ ముసి ముసి నవ్వులు నవ్వుతున్న ముత్యాల్ని చూడగానే అందరి మొహాలపైనా నవ్వు వచ్చింది! అందరికి కూడా చాలా రిలీఫ్‌గా అనిపించినట్లయింది!

ముత్యాలు గెంతుకుంటూ బయట నుండే వెనక వైపుకి వెళ్ళిపోయింది. అత్తయ్య వాళ్ళు లోపలకి వెళ్ళిపోయారు.

నిలబడే ఉన్న రజిత ఒక నిమిషం ఆగి విసురుగా బయటకు వెళ్ళేసరికి నేనూ, నీరజా బిత్తరపోయాం.

అన్నమాట నిలబెట్టుకోవటానికి... ఎవరో ఒకరే ఇంట్లో ఉండాలని అందిగా, విష్ణు ముత్యాలును తీసుకు వచ్చారని కోపంతో రజిత వెళ్ళిపోతుందా...?!

ఇప్పుడేం చేయాలి... ఆపటానికి ఎవరిని పిలవాలి.. మేం ఈ కంగారులో ఉండగానే రజిత కారు దగ్గరికి వెళ్ళి... మరిచిపోయింది కాబోలు, హ్యాండ్ బ్యాగ్,

చిన్న పాకెట్ తీసుకుని వెనక్కి తిరిగి రావటం చూసి మేమిద్దరం తేలిగ్గా ఊపిరి తీసుకుని చిన్నగా నవ్వుకున్నాం.

తర్వాత నీరజ ముత్యాలు  గురించి చెప్పింది.

శ్రీనిలయం కట్టేటప్పుడు ముత్యాలు ఇంట్లో పని అస్సలు చేసేది కాదు. రోజంతా ఇల్లు కట్టే పనుల్లోనే, ఇటుకలు, మోయటం, సిమెంటు అందించటం అలా ఏదో ఒక పని చేస్తూండేది. ఇల్లు తనే కట్టేస్తున్నట్లుగా హడావుడి చేస్తూ అందరి కూలీల మీదా అరుస్తూండేదట.

అంతా అయ్యాక "నువ్వు చాలా శ్రమ పడ్డావు.. ఏం బహుమతి కావాలి?" అని మామయ్యగారు ముత్యాల్ని సరదాగా అడిగితే, ఇల్లే తనకిచ్చేయ్యమందట! అదేంటని అడిగితే... కోపం వచ్చినప్పుడు పెద్దమ్మగారు పంపిచేస్తానని అంటూంటారు కాబట్టి ఇల్లే తనదయితే ఇక ఆ మాటెప్పుడూ అనలేరు కదాని అలా అడిగానని జవాబు చెప్పిందట!

మామయ్యగారు కూడా నవ్వుతూ... "సరే... ఈ ఇల్లు నీదే... నిన్నెవరూ ఇక పొమ్మనర్లే.." అంటూ అందరితో "విన్నారుగా.. అందరికీ తెలిసిందిగా..." అని సరదాగా అన్నారట.

ఈ విషయం ఇప్పుడు విష్ణు అత్తయ్యకు గుర్తు చేస్తూ ముత్యాల్ని పొమ్మనే అధికారం ఎవరికీ లేదన్నారన్నమాట!

ముత్యాలు అమాయకురాలే అయినా ఒక్కోసారి చాలా తెలివిగా మట్లాడుతుందనిపిస్తుంది! ముత్యాలు వాళ్ళమ్మ అత్తయ్య వాళ్ళ దగ్గిర కొన్నాళ్ళు పనిచేసిందట. ఆ తర్వాత ముత్యాలును పెట్టింది. పిచ్చిదని తన ఇంట్లో వాళ్ళెవరూ సరిగా చూడరని ఒకసారి బాధపడుతుంటే, అత్తయ్య ముత్యాల గురించి దిగులొద్దని, పని చేసినా, చేయలేకపోయినా జీవితాంతం కనిపెట్టి చూసే బాధ్యత తమదేనని వాళ్ళమ్మకు చెప్పారట.

సరైన సమయంలో ఆ మాటను గుర్తు చేసి అత్తయ్యనే కాదు, అందరి చేత కన్నీళ్ళు పెట్టించింది.

విష్ణు ముత్యాలను తిరిగి తీసుకు వచ్చినందుకు రజిత రభస చేయకపోవడం ఆశ్చర్యమే! అసలు రజిత ప్రవర్తన నాకు వింతగానే ఉంటుంది! ఒకసారి వరుసగా నాలుగు రోజులు మామూలుగా సరదాగా ఉంటే తర్వాత ఏ గొడవో పెట్టుకుని ఆ

రోజంతా రుసురుసలాడుతున్నట్లు ఉంటుంది. ఒకోసారి ఒక రోజులోనే రెండు మూడు సార్లు ఎవరిమీదనైనా గట్టిగా అరిచేసి వెంటనే మళ్ళీ మామూలుగా మాట్లాడేస్తుంది!

మనసులో ఉన్న అసంతృప్తి ఏదో అప్పుడప్పుడు ఇతరుల మీద అలా చూపిస్తుంటుందేమో!

* ❀ *

ఆ రోజు అవుట్ హౌస్‌లో ఉండే రుక్మిణమ్మగారు ఏదో పూజ చేసుకున్నానని మమ్మల్ని ముగ్గుర్నీ తాంబూలం తీసుకోవటానికి రమ్మనమని పిలిచారు. అక్కడికి రావటానికి రజిత నామోషీగా ఫీలవుతుందేమోనని నేననుకున్నాను. కానీ తనే ముందుగా "ఏదో పాపం.. పిలిచారు మనదేం పోయిందీ..పదండి.. వెళ్ళొద్దాం" అంది.

నారాయణరావుగారిది డెబ్బై ఏళ్ళ వయసయినా చాలా చురుగ్గా, ఆరోగ్యంగా ఉంటారు. నూతిలోని నీళ్ళు చేదతో తోడి స్నానం చేయటమే కాక, మొక్కలకు కూడా అలా తోడి పోస్తుంటారు! ఆయన ఆరోగ్య రహస్యం అదేనేమో!

రుక్మిణమ్మగారు కూడా అంతే... ఎప్పుడూ ఏదో ఒక పని చేస్తూనే ఉంటారు. ఆవిడ మాట్లాడుతూంటే ఎఱ్ఱరాళ్ళ కమ్మలూ, ముక్కు పుడుకా భలే మెరుస్తూంటాయి! అన్నిటికి మించి... ఆవిడను ఆ వయసులో కూడా ఎవరికైనా మళ్ళీ మళ్ళీ చూడాలనిపించటానికి ఆవిడ వదనంలో కదలాడే మందహాసమే కారణం అనుకుంటాను!

ఇద్దరూ కూడా ఆప్యాయంగా, హాస్యంగా మట్లాడటంలో ఒకరినొకరు తీసిపోరు. సరిజోడి అనిపిస్తారు.

రజిత కూడా నవ్వుతూ సరదాగా మాట్లాడింది. రుక్మిణమ్మగారు బాదం ఆకు విస్తర్లలో చక్కెర పొంగలి, పెరుగు వడలు పెట్టి ఇచ్చారు. చాలా రుచిగా ఉన్నాయి ఆమాటే రజిత చెప్పి రుక్మిణమ్మగారు మారు వడ్డిస్తాననంటే ఎటువంటి భేషజం లేకుండా పెట్టించుకుని ఇష్టంగా తింది.

అలా రజిత అరమరికలు లేకుండా మాట్లాడటం, హాయిగా నవ్వడం.. నాకు బావుంది! నా ఆనందం ఎంతో సేపు నిలవలేదు. కాసేపటిలోనే ఉరుములు!

నూతి చుట్టూ ఉన్న సిమెంటు చప్టా బాగా పాడయిందని, బాగు చేయించే విషయం పెద్దమ్మగారికి గుర్తు చేయమని రుక్మిణమ్మగారిచ్చిన పండు. తాంబూలం తీసుకుని వచ్చేస్తున్నప్పుడు నీరజతో నారాయణరావుగారు అన్నారు.

నీరజ అలాగే అన్నట్టుగా తల ఊపుతూంటే రజిత మొహం చిట్లించి "రేపో మాపో ఈ అవుట్ హౌవుస్ అదీ పడగొట్టేయ్యాల్సిందే... ఈ నుయ్యి మాత్రం ఇక్కడెందుకుంటుందీ..? ఇంకా రిపేర్లు ఎందుకూ.. దండగపని కాక పోతే! అటువేపు వీధి ఉన్నప్పుడు ఇంత విలువైన స్థలంలో తెలివితక్కువ తనంగా అవుట్‌హౌస్ కట్టారు... ఇంటి అందమే పోయింది. ఏ షాపింగ్ కాంప్లెక్సో కడితే కనీసం లాభంగానైనా ఉండేది!"

రజిత మాటలకు నిర్ఘాంతపోయినట్లుగా నిలబడిపోయిన నారాయణరావుగారు మరుక్షణమే ఏం మాట్లాడకుండా వెనక్కి వెళ్ళిపోయారు.

ఇంట్లోకి రాగానే నీరజ "ఆయన పెద్దమ్మకి చెప్పమన్న విషయాన్ని చెప్పాలిగానీ నువ్వే సమాధానం చెప్పటం ఎందుకూ... మనకి అనవసరం కదా?" రజితను అడిగింది.

"అవును.. అనవసరమే... నీకు... నాక్కాదు! ఈ ఇంటి కోడలిగా... ఏం మాట్లాడటానికైనా, నిర్ణయాలు తీసుకోవటానికైనా నాకు హక్కుంది!"

నీరజ మొహం చిన్నబోయింది. "అది కాదు, పెద్దమ్మ ఆలోచించి ఏదో చెపితే బావుంటుంది గానీ నువ్వే అలా ఖచ్చితంగా మాట్లాడితే.. పెద్దవారు కదా నారాయణరావు గారు బాధపడతారేమోనని అన్నాను..." సంజాయిషీగా అంది.

"ఎందుకు బాధ? ఏ చుట్టరికం లేనివాళ్ళ కోసం చిన్నదో పెద్దదో... ఇల్లు కట్టి తెచ్చి పెట్టుకోవటమే అసలు తప్పు! అప్పనంగా ఉంటున్నదే కాకుండా ఇంకా ఇంటికి షోకులు కావాలని అడగటం తప్పని తెలుసుకుని నోరు మూసుకుంటారు... అంతేగా! నాకు... ఇంట్లో వాళ్ళు సలహాలివ్వటమే నచ్చదు! తల దాచుకోవటానికి వచ్చిన వాళ్ళు కూడా... అన్నింటిలోనూ తల దూర్చి సలహాలివ్వటం అస్సలు నచ్చదు!" కుండబద్దలు కొట్టినట్లుగా మాట్లాడింది.

నీరజ మొహం రోషంతో ఎర్రబడిపోయింది. కన్నీళ్ళు ఆపుకోవటమే కష్టంగా ఉందని తెలిసిపోతోంది.

"ఇల్లూ వాకిలీ లేక నీడకోసం, తిండికీ కాదు. అండ కోసం మాత్రమే మేం వచ్చాం. అందరం కలిసి ఉందామని పెద్దమ్మ వాళ్ళే ఒప్పించారు. ప్రతి సంవత్సరం ఇంటికి సరిపడా బియ్యం, పప్పులు మా పొలం నుండే వస్తాయి!"

రజిత తల ఒకరకంగా వంచి కనుబొమలెగరెస్తూ ఎగతాళిగా చూసింది. "అబ్బో.. మీ తిండే అందరం తింటున్నామన్నమాట! ఆ తిండిగింజల కోసమే మిమ్మల్ని ఒప్పించి

తీసుకు వచ్చారు... అవును మరి... లేకపోతే ఇక్కడెలా జరుగుతుందీ...?! నువ్వు చెబితే మేం నమ్మాలి! ఏంటో... ఈ ఇంట్లో అందరూ గొప్పలు చెప్పుకునేవాళ్ళే..." విసురుగా రజిత వెళ్ళిపోయింది.

నీరజ కళ్ళ నుండి నీళ్ళు జలజలా రాలాయి.

"నోటికి ఏది వస్తే అది అనేస్తుంటానే కానీ నా మనసులో ఏం ఉండదని రజితే చెబుతూంటుందిగా, ఆ మాటల్ని పట్టించుకుని నువ్వు బాధపడడం అనవసరం నీరజా.." చేయి పట్టుకుని అనునయంగా అన్నాను.

"ఏం లేకపోవటమేమిటి... నిలువెల్లా అహంకారమే! దూరంగా ఉన్నా ఊరుకోదు... వెంటపడి మరీ గిచ్చుతూంటుంది.." అంది కళ్ళు తుడుచుకుంటూ...

నీరజది మామూలు వ్యవసాయదారుల కుటుంబం. నేనూ.. అంతే ఒక సాధారణ ఉద్యోగస్తుని కూతుర్ని. రజిత... తను మాత్రం ఒక గొప్ప వ్యాపార వేత్త పెంపుడు కూతురు. మేమిద్దరం మా స్థాయిని బట్టి తన మాటల్ని విని ఊరుకోవాలే తప్ప ఖండించే సాహసం చేయకూడదని రజిత ఉద్దేశ్యం. ఈ విషయాన్ని పరోక్షంగా తన మాటల ద్వారా అప్పుడప్పుడు తెలియజేస్తూనే ఉంటుంది. అందుకేనేమో ఎప్పుడైనా తన మాటల్ని కాదన్నట్లుగా మాట్లాడితే అసహనంతో రెచ్చిపోతూంటుంది!

మళ్ళీ నాలుగు రోజుల తర్వాత ఈ సారి దాడి నా మీదే జరిగింది!

❉ ❀ ❉

ఆ మధ్యాహ్నం... భోజనానికి నేనూ, రజితా డైనింగ్ రూమ్‌కి వచ్చేసరికి డైనింగ్ టేబుల్ దగ్గర కూర్చుని ఎవరో అతను భోజనం చేస్తున్నాడు. పక్కనే నిలబడి శాంతమ్మ వడ్డిస్తోంది. ముందుగా వచ్చిన రజితను చూస్తూనే అతను "అక్కయ్యగారూ... నమస్కారం. చేతులు జోడించటానికి.. ఒక చెయ్యి ఖాళీగా లేదండి... పనిలో ఉంది కదా..." అంటూనే నన్నూ చూసి నమస్కారమన్నట్లుగా కొద్దిగా తలవంచి చిరునవ్వు నవ్వాడు.

"మా అబ్బాయి రంగా.. కాలేజికి సెలవుల్లేవని ఈ మధ్యకాలంలో రాలేదు. ఇంటికి వచ్చి చాలా నాళ్ళయింది. నాలుగు రోజులు సెలవులొచ్చాయని ఇప్పుడొచ్చాడు..." శాంతమ్మ మొహంలో వెలుగు. చాలా నాళ్ళకి కొడుకుని చూసి ఆనందమన్నమాట!

రజిత మొహం చిట్లించి చూస్తూ "అక్కయ్యగారా అదేం పిలుపు..? మీ అబ్బాయైతే నువ్వు తినే చోట తినాలి గాని.. ఇక్కడేమిటి..?" కోపంగా అంది.

రంగా ఒక్క క్షణం తెల్లబోయి అలాగే చూసి వెంటనే సర్దుకుని నవ్వేశాడు. "నిజమే మేడమ్.. పెద్దమ్మగారి ఆర్డరు కాదనలేకగానీ... నాకూ ఇక్కడ... అదేమిటో బావుండదండి. క్రింద కూర్చుని తింటేనే అమ్మ చేతి వంట అసలైన రుచి నోటికి అందుతుంది! ఇప్పుడు మీరు పెద్దమ్మగారి ఆర్డరు కాన్సిల్ చేసేశారు కాబట్టి.... సమస్యే లేదు..." అంటూ నోటిలో ముద్ద నములుతూనే పళ్ళెం ఎడమ చేతిలో పట్టుకొని వంటగదిలోకి వెళ్ళాడు.

శాంతమ్మ ఎప్పుడూ వంటగదిలో వెనక గుమ్మం తలుపు తీసుకుని అక్కడే కూర్చుని తింటుంది.

రజిత కుర్చీని బర్రున లాగి విసురుగా కూర్చుంది.

శాంతమ్మ తలవంచుకుని మా ఇద్దరికీ పళ్ళాలు పెట్టి వడ్డించి వంటగదిలోకి వెళ్ళిపోయింది. మామూలుగా అన్నీ టేబుల్‌పైనే ఉంటాయి కాబట్టి ఎవరికి కావల్సినవి వాళ్ళు వడ్డించుకుంటారు. అందరూ ఒకేసారి కూర్చున్నప్పుడు పిలిస్తే వచ్చి ఏవైనా అందించటానికీ, వడ్డించటానికీ శాంతమ్మ గుమ్మం దగ్గిరే ఉంటుంది.

నేనూ నా ప్లేటు తీసుకుని వంటగదిలోకి వెళ్ళి రంగాకి కొంచెం దూరంగా కూర్చుంటూ "తమ్ముడూ... నేనూ ఈ పూట నీతో పాటే తింటాను.... ఫరవాలేదుగా!" అన్నాను.

శాంతమ్మ హడావుడి పడ్తూ "అయ్యో... అదేమిటమ్మా... వద్దు..." అంటూ నా చేతిలోని ప్లేటు అందుకోబోయింది.

రంగా కూడా "వద్దండీ... నాకు అలవాటు గానీ మీరెందుకూ క్రింద కూర్చోవటం... నాకు ఇలా కూర్చుని తినటం సరదా కూడానండీ..." అన్నాడు తడబడిపోతూ.

"నాకూ అలవాటుంది. మా నాన్నమ్మ ఎప్పుడూ పీట వేసుక్కూర్చునే తింటుంది. నాన్నమ్మతో కలిసి తినేటప్పుడు నేనూ, నాన్నగారూ కూడా క్రింద కూర్చునే తింటాం. అలా తినటం నాకూ ఇష్టమే!" అని చూపుడు వేలు చూపిస్తూ "నన్ను మాత్రం 'అక్కయ్యా' అనే పిలవాలి!" హెచ్చరించాను.

నా వేపు ఒక క్షణం విభ్రాంతిగా చూసిన రంగా తలవంచుకున్నాడు.

"రంగా... సరదాగా మీ కాలేజీ కబుర్లేమైనా చెప్పు... నువ్వు జోక్స్ బాగా చెబుతూంటావని నీరజ చెప్పింది. మాట్లాడవేంటీ...?" చనువుగా పలుకరించాను. శాంతమ్మ రజితకి ఏంకావాలో చూసి, కూర గిన్నెలతో మళ్ళీ నా దగ్గరకు వచ్చింది. ఎప్పుడూ క్లుప్తంగా, నిదానంగా మాట్లాడే శాంతమ్మ ఆరోజు హడావుడిగా ఏదో మాట్లాడేస్తోంది. నేనూ వంటగదిలో కూర్చుని తింటున్నందుకు కంగారు పడుతోందేమో!

"మీకు క్యారట్ ఫ్రై ఇష్టంగా, కొంచెం వేయనా... కొబ్బరి పచ్చడి బాగుందా... వంకాయ కూర అంత బాగా లేదు కదమ్మా... కాయలు ఫ్రెష్‌గా లేవు... అందుకనే అలా ఉన్నట్లుంది...."

ఆవిడ మాటలకు రంగా చిన్నగా నవ్వాడు.. "చూశారా అక్కయ్యగారూ.. మా అమ్మకూ్కడా ఇంగ్లీషు పదాలు వచ్చేస్తున్నాయి..." అంటూ "మీకో జోక్ చెప్పనా?" అనడిగాడు.

నేను హుషారుగా "చెప్పు... చెప్పు..." అన్నాను.

"మా కాలేజీ క్యాంటీన్‌లో బ్రెడ్, జామ్‌లతో పాటు షాంపూలు, సబ్బులు లాంటివి కూడా అమ్మకానికి ఉంటాయి. మావాడొకడికి బ్రెడ్ తీసుకునేటప్పుడు ప్రతీసారీ 'ఫ్రెషే కదా?' అని అడిగి నిర్ధారించుకోవటం అలవాటు. ఒకసారి వాడు సోప్ తీసుకుంటూ కూడా అలవాటులో పొరపాటుగా 'ఫ్రెషేనా?' అనడిగాడు. ఇంకేముందీ... అందరికీ ఒక గొప్ప ఛాన్సు దొరికింది! వాడు ఎవరినైనా ఏ బుక్కో, ఏ పెన్నో అడిగినా 'ఫ్రెష్ కాదురా .. ఫరవాలేదా?' అనటమే! ఆ మాటతో వాడిని ఒక సంవత్సరం పాటు అలా ఏడిపించుకు తిన్నారు!"

పెద్దగా నవ్వాను! "ఈ జోక్ కూడా ఫ్రెష్‌ది కాదు.. సంవత్సరం క్రితంది.. అవునా?" అంటూ మళ్ళీ నవ్వాను.

శాంతమ్మ మొహంలోకి చిరునవ్వు వచ్చింది.

తరువాత రంగా అప్యాయంగా చూస్తూ... "చాలానాళ్ళ తర్వాత అమ్మ చేతి వంట... ఆపైన మీతో కలిసి చేయటం... ఈ రోజు భోజనం నిజంగా అమృతమే అనిపించింది అక్కయ్యగారూ!" అన్నాడు.

నాకూ సంతోషంగానే ఉంది.

నేను మెట్లెక్కి వెళ్తోంటే, అత్తయ్య గది ముందు నిలబడిన రజిత గట్టిగా నా మీద కంప్లైంట్ చేస్తోంది. “నాకైతే తప్పొప్పులు చెబుతావు గానీ పెద్ద కోడలికి చెప్పవా? వాళ్ళింట్లో నేల మీద కాదు వీధిలో కూర్చుని తిన్నా ఫరావాలేదు... కానీ ఇక్కడ పనివాళ్ళతో వంటగదిలో కూర్చుని తింటే... ఎవరికి పరువు తక్కువ. నీ కోడలనేగా అంటారు... నువ్వెందుకు బుద్ధి చెప్పవ్...?”

వడగళ్ళ వానలా రజిత వాగ్ధాటి సాగిపోతోంది. నాకు వినపడాలనే అంత గట్టిగా మాట్లాడుతోందని తెలుస్తోంది. ఇంకా ఏమేమి అన్నదో... అత్తయ్య ఏం సమాధానం చెప్పారో తెలియదు. నేను ఆగకుండా వచ్చేశాను.

తప్పు చేసినట్లుగా నాకేమీ అనిపించలేదు! శాంతమ్మతో ఉన్న దూరపు బంధుత్వాన్ని బట్టి కాకపోయినా, రంగా విద్యకైనా విలువనిచ్చి రజిత మాట్లాడి ఉండాల్సింది. ఆపైన భోజనం చేస్తున్న మనిషిని లేపటం నిజంగా అమానుషమే!

ఎవరి పట్లయినా ఆప్యాయతా, గౌరవం చూపించటానికి ఆర్థిక స్థితి మాత్రమే అర్హత కాకూడదు కదా!

విష్ణుకు ఇలాంటి విషయాలన్నీ నాకై నేను చెప్పను. అత్తయ్య ద్వారానో, ఇంకెవరి ద్వారానో ఇంటి సంగతులు తెలిస్తే తెలుస్తాయి. వీళ్ళిలా అన్నారు. ఇలాంటి వాదన వచ్చింది లాంటి చిరాకు కలిగించే విషయాలు విష్ణుకు చెప్పటం అనవసరమనిపిస్తుంది. ఏదైనా సంతోషం కలిగించే సంగతులైతే తప్ప.

విష్ణు సమక్షంలో నాక్కలిగే ఆనందాన్ని పూర్తిగా అనుభవించాలి... ఇలాంటి విషయాలతో ఆ ఆనందాన్ని కొంతయినా వదులుకోవడం నాకిష్టం ఉండదు.

విష్ణు ఎప్పుడైనా బిజినెస్ వ్యవహారాలు యధాలాపంగా చెప్పబోయినా వద్దంటూ నమస్కారం పెట్టేస్తాను. అర్థం చేసుకుని తగిన సలహాలివ్వగలిగే పరిజ్ఞానం లేనప్పుడు ఇంకెందుకూ అనిపిస్తుంది. ఇద్దరం ఒక్కోసారి బాల్య స్మృతుల్లోకీ, ఇంకోసారి కాలేజీ కబుర్లలోకి వెళ్ళిపోతాం! చదివిన మంచి పుస్తకం, చూసిన సినిమా, స్నేహితులు... దేని గురించైనా మాట్లాడుకోవటం నాకు బాగానే ఉంటుంది. విష్ణుతో గడిపే ప్రతి నిముషం ఆహ్లాదకరమే.. అమూల్యమే!

❊ ❀ ❊

నీరజ ఫ్రెండ్సెవరో వస్తే నన్నూ వాళ్ళ దగ్గర కూర్చోబెట్టింది. వాళ్ళు అంతకు ముందు వచ్చినప్పుడు నీరజ పరిచయం చేసింది. వాళ్ళు చదవాలనుకుంటున్న నవల ప్రస్తావన వస్తే, అది నా దగ్గరుందని ఇస్తానని చెప్పి పైకి వచ్చాను.

అత్తయ్య, మామయ్యగారు క్రింద బెడ్‌రూముల్లోకి మారిపోయారు. పై గదుల్లో కృష్ణప్రసాద్, మేము మాత్రమే ఉంటున్నాం. రజిత వాళ్ళ గది తలుపులు కొంచెం తెరిచి ఉన్నాయి. క్రింద హాలులో నీరజ ఫ్రెండ్స్‌తో నేను మాట్లాడుతూండటం రజిత చూసింది కాబట్టి ఆ సమయంలో నేను పైకి రాననుకుని మామూలుగానే స్వరం తగ్గించకుండా మాట్లాడుతోందనకుంటా. తన మాటలు స్పష్టంగా వినిపించాయి.

“.. ఆవిడ్ని అందరూ అంటరాని దానిలా చూస్తున్నారు... మేనకోడలివి నిన్ను నెత్తిమీద పెట్టుకుని పెత్తనం అప్పగిస్తారని చెప్పావ్... ఇప్పుడేమో అంతా తారుమారుగా ఉంది. ఆవిడగారినే నెత్తిమీద పెట్టుకుంటున్నారు. నష్టజాతకమనే మాటే మీద పడనీయకుండా అందరూ ఒకటై చేతులడ్డం పెట్టేశారు... నువ్వేం చేయగలిగావ్.. పైకి మాట్లాడదన్న పేరే గానీ పెద్దత్త మొన్న ఎవరితోనో ఫోనులో ‘మా పెద్ద కోడలు చాలా పద్ధతయినది’ అంటూ పొగిడేయటం నేనే విన్నాను. ఈ ఇంట్లో నేను ఉండలేను. వేరే మార్గం చూడు.. నా మాటకి చిల్లిగవ్వ విలువ కూడా లేదు. ఆఖరికి పనిమనిషి... పిచ్చిదాన్ని కూడా ఇంట్లోంచి పంపించలేకపోయాను...”

“రజితమ్మా.. నీకస్సలు ఓపిక లేదు... పనులు నిదానంగానే చక్కబెట్టుకోవాలి. నీకేమీ తెలియదు, బడబడలాడటమే తప్పు. పిడికెడు మెతుకులు పడేస్తే బండెడు చాకిరీ చేసే పిచ్చిదాన్ని బయటకు పంపేస్తే నీకేమొస్తుంది.... తెలివి తక్కువ పనులు చేస్తావ్! ఎవర్ని పంపిస్తే ప్రయోజనం కలుగుతుందో వాళ్ళని పంపించాలి గానీ...”

అవి కోదండంగారి మాటలు. మెల్లగానే మాట్లాడుతున్నారు.

నేను చప్పుడు చేయకుండా గదిలోకి వెళ్ళి పుస్తకం తీసుకుని అలాగే మెల్లగా వచ్చేశాను. కోదండంగారు ఎవర్ని బయటకు పంపించాలనుకుంటున్నారు?

ఎవరో బయటకు వెళ్తే ఏం ప్రయోజనం... ఎవరికి కలుగుతుంది..??

నాకేం అర్థం కాలేదు. ఏమిటని ఆలోచించటమూ అనవసరమనిపించింది.

అత్తయ్య... నా గురించి ప్రశంసిస్తూ మాట్లాడారా..?!

ఆ మాటకి.. మనసులో ఎన్ని పులకింతలో..! పదే పదే తలుచుకున్నాను.

* ❀ *

నాన్నగారు ఫోను చేశారు. అక్కడంతా బాగానే ఉందన్నారు. విష్ణు పెద్ద మొత్తంలో లోను కోసం ప్రయత్నిస్తున్న విషయం రామబ్రహ్మం అంకుల్ ద్వారా తెలిసిందట. ఈ సమయంలోనే తాతగారి ద్వారా నాకు సంక్రమించిన ఆస్తిపాస్తుల వ్యవహారమంతా విష్ణుకు అప్పగించాలనుకుంటున్నానన్నారు. విష్ణులాంటి వ్యక్తి అల్లుడుగా లభించటం తనకి చాలా సంతృప్తిగా, సంతోషంగా ఉందనీ, అందుకే ఆస్తిపాస్తుల బాధ్యత విష్ణుకిచ్చేస్తే, తనకి తేలిగ్గా ఉంటుందని చెప్పి నా సలహా అడిగారు.

విష్ణు సహచర్యం... నాకు నిజంగా అపురూప వరమే!

నాన్నగారితో, "మీ ఇష్ట ప్రకారమే చేయండి" అన్నాను.

నాన్నగారు తన స్వార్జితంతోనే నన్ను పెంచి, పెళ్లి చేయాలనుకున్నారు. అలాగే చేశారు. ఆస్తిపాస్తుల ప్రమేయం లేకుండానే నేను విష్ణు జీవితంలోకి అడుగు పెట్టాను. ఈ ఇంటికీ విశ్వనాథంగారి అమ్మాయిగానే వచ్చాను. ఈ విషయం నాకూ సంతృప్తినీ, ఆనందాన్నీ కలిగించింది! ఇప్పుడు... బ్యాంకులో ఉన్న డబ్బు విష్ణు వ్యాపారానికి ఉపయోగపడితే... అంతకంటే కావల్సిందేముందీ... ఆ తర్వాత నాన్న గారి సలహాతో ఏం చేయటమన్నది ఆలోచించవచ్చనుకున్నాను.

❊ ❀ ❊

ఆ రోజు అత్తయ్య, కృష్ణప్రసాద్ మామయ్య గారిని ప్రతి నెలా జరిగే రెగ్యులర్ చెకప్‌కి హాస్పిటల్‌కి తీసుకు వెళ్లారు.

శాంతమ్మ పిండి వడియాలు పెట్టటానికని పెరటి వేపున రెండు నవారు మంచాలు వేసి పైన పలుచని దుప్పట్లు పరిచి రెడీ చేసింది.

పిండి చిక్కబడిపోకముందే పెట్టెయ్యాలని, చిన్నత్తయ్య, నీరజ, శాంతమ్మ పెడుతూంటే నేనూ చిన్న గిన్నె, స్పూను తీసుకున్నాను. ఆ పని నాకూ సరదానే. నాన్నమ్మ పెట్టేటప్పుడు నేనూ చేస్తుండేదాన్ని.

రజిత ఎదురుగా ఒక స్టూలు వేసుకూర్చుని కబుర్లు చెబుతోంది.

షరా మామూలే అన్నట్లుగా తను చిన్నప్పటి నుండీ ఎంత గారాబంగా పెరిగిందో సోదాహరణంగా చెబుతోంది! అలా పదే పదే వివరించకపోతే, మాలాగే తనూ పెరిగిందనే అజ్ఞానంలో మేముండిపోతామేమోనని తన భయం అనుకుంటా! అందుకే సమయం దొరికినప్పుడల్లా యధాశక్తి వర్ణిస్తూంటుంది! పిల్లలు గారాబంగా పెరగటానికి

తల్లిదండ్రులు సంపన్నులే కానక్కరలేదనేది తనకు తెలియని విషయం! తండ్రి చనిపోవటం వలన నీరజ ఈ ఇంట్లోకి రాగలిగింది. నేనేమో... విష్ణును మభ్యపెట్టి అదృష్టమనే సుడిగాలికి కొట్టుకొచ్చి ఇక్కడ పడ్డాను! తను మాత్రమే సరియైన అర్హతతో ఈ ఇంటికి కోడలిగా వచ్చిందని రజిత నమ్మిక. చూపుల్లో, మాటల్లో ఈ అభిప్రాయాన్ని చాలా సార్లే వ్యక్తపరిచింది. తన మాటలకి నేను కన్నీళ్ళు కార్చకపోవటమనేది రజితను బాధించే అంశాల్లో అదొకటి!

నాకు రజిత మాటల్లో అహంకారం కంటే అమాయకత్వమే ఎక్కువగా కనిపిస్తుంది. అందుకే చాలాసార్లు సమాధానం చెప్పటం కూడా అనవసరమనిపించి విని ఊరుకుంటాను!

పరీక్షల సమయంలో అయినా సరే తనను చదువుకోమని ఇంట్లో వాళ్ళు గట్టిగా చెప్పలేకపోయేవాళ్ళట! ఆ మాత్రంగా కష్టపడటం కూడా వాళ్ళకిష్టం ఉండేదికాదట మరి! టీచర్లకి చిన్న చిన్న గోల్డ్‌చైన్సు కానుకలుగా ఇచ్చి మార్కులు మాత్రం బాగానే సంపాదించేదాన్నని నవ్వుతూ చెప్పింది.

గారాబంగా పెరగటం అంటే... ఇదే కాబోలు!

అదీ, ఇదీ అందిస్తూ తిరుగుతున్న ముత్యాలు "బాగుంది... బాగుంది" అంటూ నవ్వింది. "మీకు నేనే టీచరమ్మనైతే... నాకెన్ని గొలుసులొచ్చుండేయో..." అంటూ నిట్టూర్చింది.

రజితకు కోపం వస్తుందనుకుని నేను ఉలిక్కిపడి తన వేపు చూశాను గానీ అదేం లేదు.. మామూలుగానే ఉంది నవ్వుతూ.

ఇంతలో నారాయణరావుగారు, రుక్మిణమ్మగారు, శంకరం అక్కడికి వచ్చారు.

ఇల్లు ఖాళీ చేసి వెళ్ళిపోతున్నామని చెప్పగానే చిన్నత్తయ్య షాకయినట్లుగా చూసి

"అదేంటండీ.. మీరు ఖాళీ చేయటమెందుకూ...? అది మీకోసమని కట్టించిందేగా? హఠాత్తుగా ఇలా ఎందుకు చేస్తున్నారూ...?" అనడిగారు.

"బాబుగారి బలవంతం మీద ఇప్పటికే చాలా సంవత్సరాల నుండీ ఉంటున్నాం. నాలుగు వీధులవతల మా బంధువులదే.... చిన్న పోర్షన్ ఖాళీగా ఉందని.... తోడుగా ఉంటామని... వచ్చెయ్యమని వాళ్ళెప్పటి నుండో అడుగుతున్నారు. శంకరానికి కూడా స్కూలు అక్కడికి కొంచెం దగ్గిరా అవుతుంది. ఈ రోజు మంచి రోజని సామాన్లు... అవెన్ని ఉన్నాయిలెండి... ఆ నాలుగూ బండికెక్కించేశాను. పెద్దమ్మగారు లేకుండా

వెళ్ళటం నాకూ బావుండలేదు... రేపో, ఎల్లుండో వచ్చి కలుస్తానని చెప్పండి..” అని అక్కడున్న అందరికీ వెళ్ళొస్తామని చెప్పారు.

సామాను కూడా పంపించేశామని చెప్పటం వలన ఇక అభ్యంతరం చెప్పేది కూడా లేదని తెలిసి కాబోలు చిన్నత్తయ్య నిర్విణ్ణురాలైనట్లుగా అలా చూస్తుండిపోయారు.

వాళ్ళతో పాటు రెండడుగులు వేసిన శంకరం మళ్ళీ వెనక్కి వచ్చాడు.

నాతో “అక్కయ్యగారూ... మొన్న నేను కంఠస్థం చేస్తున్న శ్లోకానికి అర్థం ఏమిటని అడిగితే నాకూ తెలియదని, తాతగారినడిగి చెబుతానని అన్నా కదండీ... తర్వాత తాతగారు చెప్పారు. ప్రియంగా, హితంగా, సత్యంగా మాట్లాడడం ఓ తపస్సు! ఆ తపస్సే మనిషి ఉన్నతికి కారణమవుతుంది! ఆశ్లోకం భావం ఇదేనండీ...” అన్నాడు.

నేను ఆశ్చర్యంగా చూశాను.

శంకరం చూపులు ఒక సెకను సేపు రజిత మీదకు తిరగటంతో నాకు విషయం ఏమిటో కొంచెం అర్థమైంది. నిజానికి.. నేను శంకరాన్ని ఏమడగలేదు. అయినా అలా చెప్పాడంటే.. పరోక్షంగా రజితకు ఆ మాటల్ని చెప్పాలనే అయి ఉంటుంది! వాళ్ళ తాతగారితో రజిత దురుసుగా మాట్లాడిన విధానాన్ని ఇలా ఖండిస్తున్నాడు కాబోలు! ‘నేనెప్పుడడిగానూ?’ అని తనను ప్రశ్నించకుండా అర్థం చేసుకుంటాననే నమ్మకం నాపై ఉందన్నమాట!

శంకరం చేతులు జోడించి మళ్ళీ వెళ్ళొస్తానని చెబుతుంటే, ఉండమని చెప్పి... మొన్నీ మధ్య విష్ణు నాకు ఇచ్చిన ఖరీదైన పెన్‌సెట్ తీసుకువచ్చి ఇచ్చాను. ఆ బాక్సులో మూడు పెన్నులున్నాయి.

ఆ బాక్స్ తీసి చూసి చాలా ఆనందంగా “థేంక్స్” చెప్పాడు.

“అక్కయ్యగారూ.. ఒకటి మామూలుగా రాసుకోవటానికి, ఒకటి ఎగ్జామ్స్‌కీ... ఇంకొకటి జాగ్రత్తగా దాచి మేం ఏ ఊరు వెళ్ళినా అక్కడి నుండి ఈ పెన్నుతో మీకు ఉత్తరాలు రాస్తాను!” చిరునవ్వుతో అన్నాడు.

“తప్పకుండా అలాగే చేయాలి!” నేనూ సంతోషంగా అన్నాను.

శంకరం మాటలు వింటే.. ఎవరికైనా ఆప్యాయంగా దగ్గరకు తీసుకోవాలనిపిస్తుంది! అలాంటి ఆకర్షణ ఏదో శంకరంలో ఉంది!

శంకరం వెళ్ళిపోగానే, బొమ్మల్లా నిలబడిపోయి చూస్తున్న అందరిలో చలనం వచ్చింది. పని ముగించటానికి హడావుడి పడ్డారు.

తన మాటలవల్లే నారాయణరావుగారు ఖాళీ చేసి వెళ్ళిపోయారని రజితకీ అర్థమైనట్లుంది.

"ఈ ముసలాయనకి కొంచెం చాదస్తం ఉన్నట్లు ఉంది.." అంటూ గట్టిగా నిట్టూర్చింది. "ఎప్పుడో పడగొడతామని చెబితే... ఈ వేళో, రేపో అన్నట్లుగా కంగారెందుకో... ఖాళీ చేసేశారు! అయినా ఇదీ మంచిదే... మనం చెప్పి ఖాళీ చేయించాల్సిన అవసరం లేకుండా వాళ్ళే వెళ్లిపోయారు! ఏదయినా సరే, నేను మనసులో దాచుకోను.. పైకే చెప్పేస్తాను... నాకు మనసులో ఏం ఉండదు.." అంది.

"గిన్నెలో లేంది గరిటలోకి ఎలా వస్తుందమ్మా...?" ముత్యాలు నీరజతో అంది. గిన్నెలో చాలా కొద్దిగా ఉన్నపిండిని శబ్దం చేస్తూ స్పూనులోకి తీయబోతున్నందుకే యాధాలాపంగా అలా అన్నదో... లేక మనసులో లేనిది మాటల్లోకి మాత్రం ఎలా వస్తుందని పరోక్షంగా రజితను ప్రశ్నించిందో...?!

నేను విచిత్రంగా చూశాను.

రజిత ఏం పట్టించుకోలేదు కాబట్టి గాలి వాన రాలేదు!

## 13

నారాయణరావుగారు వాళ్ళు వెళ్ళిపోయినందుకు విష్ణు బాధపడ్డారు. నారాయణరావు గారి అబ్బాయికి ఇంకో సంవత్సరంలో ఆంధ్రప్రదేశ్‌కే ట్రాన్స్‌ఫర్ వస్తుందని అనుకుంటున్నారు. అప్పుడు ఏ ఊరికైతే అక్కడికి వాళ్ళు వెళ్ళి పోయే ఉద్దేశ్యంలో ఉన్నారు. ఈ లోపుగా ఇలా వెళ్ళాల్సి రావటం బాగా లేదని అనుకున్నారు.

ఆ మరునాడే అత్తయ్య నీరజను తోడు తీసుకొని నారాయణరావుగారు మారిన ఇంటికి రెండు బుట్టల నిండా పళ్ళు, వాళ్ళందరికీ కొత్త బట్టలు తీసుకుని వెళ్ళి వచ్చారు.

❊ ❀ ❊

విష్ణు వైజాగ్ వెళ్ళాల్సిన పని ఉందని నన్నూ సరదాగా రమ్మన్నారు.

నాన్నగారూ, నాన్నమ్మా అక్కడ లేరు. పద్మ కూడా లేదు. విజయనగరంలో జాబ్‌లో చేరింది. అందుకనే రానని చెప్పేశాను. విష్ణుకి తీరిక దొరికాక నాన్నగారి దగ్గరకే వెళ్ళాలి. ఆ రోజు ఎప్పుడు వస్తుందో..!

నాన్నగారు నన్ను అత్తవారింటి సంగతులు అడిగితే... దాచాల్సిన అవసరం లేకుండా ఆనందంగా చెప్పగలిగే పరిస్థితి ఉండాలి!

“నువ్విక్కడున్నావా... నీ కోసం ఇల్లంతా వెతికాను..” అంటూ రజిత వచ్చింది.

సాయంకాలం చల్లగాలికి వెనక బాల్కనీలో కుర్చీ వేసుకుని పుస్తకం పట్టుకున్నాను. లోపలికి వెళ్ళి రజిత కూడా ఓ కుర్చీ తెచ్చుకుని కూర్చుంది.

“అబ్బ... ఇప్పుడు చూడు... ఇక్కడ కూర్చుంటే ఎంత బావుందో...! అవుట్ హౌస్‌లో వాళ్ళుంటే చాలా చిరాగ్గా ఉండేది!” అంది.

నేనింతకుముందే మనుషులు అలికిడి లేక కళావిహీనంగా ఉందని అటు చూస్తూ అనుకున్నాను. ఒకే విషయం ఒక్కొక్కరికి ఒక్కోరకంగా అనిపిస్తుంది!

దృష్టి బేధం అంటే ఇదే కాబోలు!

పుస్తకం పక్కన పెట్టేశాను. రజిత ఏదో చెప్పాలనుకుంటోందని తెలుస్తోంది. ఉపోద్ఘాతం లేకుండా మొదలు పెట్టేసింది. “శాంతమ్మ కొడుకు రంగా... చదువుతున్నాడంటే... ఏదో అనుకున్నా... మెడిసిన్ అట కదా! ఆస్తిపాస్తులు లేకపోయినా, వంటావిడ కొడుకే అయినా... డాక్టరు కదాని నేనో సంబంధం చూశాను. మా పిన్ని అంటే.. దూరపు బంధుత్వమేలే... ఒకప్పుడు బాగా ఉన్నవాళ్ళే.. ఈ మధ్య వ్యాపారంలో కొంచెం దెబ్బతిన్నారు.. అందుకే వాళ్ళమ్మాయిని ఇవ్వటానికి ఒప్పుకున్నారు... అదేలే నేనే నచ్చచెప్పి ఒప్పించాను. వంట మనిషి కొడుకంటే.. వాళ్ళకీ కొంచెం నామర్దాగా ఉంటుందిగా, నేను చెప్పేసరికి సరే అన్నారు...”

“శాంతమ్మకి చెప్పావా?”

“చెప్పాను. అసలు తన కొడుకుని చదివిస్తున్నది. మనమేగా... లేకపోతే ఎక్కడ ఉండేవాడో.. సంబంధం చెప్పగానే ఎగిరి గంతేసి ఒప్పుకోవాల్సింది పోయి.. పెద్దవాళ్ళతో మనకెందుకమ్మా. వాడికి నచ్చిన అమ్మాయిని చేసుకుంటాడని చెబుతోంది...”

“మంచి మాటేగా...!”

ఏం మంచి గడ మంచి! నచ్చిన అమ్మాయంటే ప్రేమించి చేసుకోవటమేగా...! తాడూ బొంగరం లేని వాళ్ళెవరినో చేసుకొని తీసుకు వస్తే... శాంతమ్మకి అప్పుడు తెలిసి వస్తుంది! ఈరోజుల్లో చాలా మంది పిల్లలకు నాలుగు అక్షరం ముక్కలు చెప్పించేసి... ప్రేమించి పెళ్ళి చేసుకోండని వదిలేస్తున్నారు! ఇంకా కొందరైతే... పెళ్ళి

ఖర్చులు కూడా దండుగని సంతకాల పెళ్ళి చేసి చేతులు దులిపేసుకుంటున్నారు! మాట వరసకి చెబుతున్నా.. నిన్ననుకునేవ్..."

"అనుకోను.. ఇష్టపడి చేసుకోవటమే ముఖ్యం గానీ పెళ్ళి ఏ రకంగా జరిగినా ఒకటేనని మేం నిర్ణయించుకున్నాం. పెద్దవాళ్ళ ప్రమేయం లేదు!"

"అంటే.. బావకి ఇష్టం లేకపోయినా ఒప్పించి మా పెళ్ళి చేసేరనేగా అంటున్నావ్?" కొంచెం రుసరుసలాడింది.

"అలా నేనెందుకంటానూ..! కృష్ణప్రసాద్‌కి ఇష్టం లేదన్న సంగతి ఇప్పుడు నువ్వు చెబితేనే వింటున్నాను... నాకు తెలియనే తెలియదు!"

"పెద్దవాళ్ళ మాట విన్నాడు కాబట్టే... పెళ్ళి అంగరంగ వైభవంగా జరిగింది! ఇం.... త బంగారంతో వచ్చాను! ఏ డాక్టరునో చేసుకుంటే ఏముందీ.. మెడలో ఓ స్టెతస్కోప్‌తో దిగిపోయేది!" అంది పెదవి విరుస్తూ.

స్టెతస్కోపు... అని ఎంత తేలిగ్గా అనేసింది! అది చేతిలోకి రావాలంటే.. తెలివి తేటలు, కృషి, పట్టుదల ఎంత ఉండాలి! పెద్దవాళ్ళు కొనిపెట్టిన బంగారానికే గానీ... డాక్టరు పట్టాకేం విలువే లేదన్నమాట... తన దృష్టిలో!

"అది సరే గానీ.. నేను చెప్పిన సంబంధం గురించి శాంతమ్మతో నువు మాట్లాడు.." అంది.

"నేను.. ఎందుకూ.. మాట్లాడటం...?" ఆశ్చర్యంగా అడిగాను.

"నేనేదైనా సూటిగా కుండబద్దలు కొట్టినట్లు మాట్లాడేస్తాను. కొందరికది నచ్చదుగా... నువ్వయితే సుతిమెత్తగా మాట్లాడగలవు. ఈ సంబంధం వదులుకుంటే మళ్ళీ ఇలాంటిది దొరకదని శాంతమ్మకు నచ్చచెప్పు. పెళ్ళి ఖర్చులే కాదు, ఆ తర్వాత కూడా రంగా సంగతులన్నీ వాళ్ళే చూసుకుంటారు. శాంతమ్మకి ఏ బాధ్యతా ఉండదు. హాయిగా ఏ ఓల్డేజ్ హోమ్‌లోనో ఉండిపోవచ్చు..."

నేను అదిరిపడి "ఓల్డేజ్ హోమ్‌లో ఎందుకుంటుందీ... కొడుకు దగ్గిర ఉండకుండా?" అడిగాను.

"ఈ రోజుల్లో పెద్దవాళ్లు పిల్లల దగ్గిర ఉంటున్నారా...? అలాంటి హోమ్‌లో ఉండటమే పెద్దలకీ, పిల్లలకీ సుఖంగా ఉంటోంది! మొన్నామధ్య శాంతమ్మ అంది... ఉద్యోగం వచ్చాకయినా కొడుకు దగ్గిర ఉండదట... తనకి కాలూ చెయ్యి ఆడినంత కాలం ఇలా పనిచేస్తూ పెద్దత్త దగ్గిరే ఉంటాననంటోంది!"

"అత్తయ్యంటే శాంతమ్మకు అంత అభిమానం! కృతజ్ఞత చూపించటమనేది కూడా మంచి మనసున్న వాళ్ళకే సాధ్యపడుతుంది!"

"పనివాళ్ళతో మనకి అభిమానాలేమిటి...? ఇలాంటి మాటలంటే నాకు గొప్ప చిరాకు! మనం డబ్బు పడేస్తాం... వాళ్ళు పనిచేస్తారు... అంతవరకే! మా ఇంట్లోనూ పదిమంది పనివాళ్ళున్నారు. వాళ్ళని చూస్తుంటాగా... ఎంత బాగా చూసినా సరే ఎవరైనా పదిరూపాయలెక్కువ ఇస్తామంటే మనల్ని వదిలేస్తారు... అలా ఉంటాయి అభిమానాలు.. నాకు తెలియదా...!"

"అందరూ ఒకలా ఉండరు. రాముడి లాంటి రాజు ఉన్నప్పుడే హనుమంతుడిలాంటి బంటూ ఉంటాడని సామెత..."

"నేనొకటి చెబుతూంటే, నువ్వింకేదో అంటావు! పిల్లాడి తల్లి వంటమనిషని ఎవరికీ తెలియదు. ఏ ఓల్డేజ్ హోమ్‌లోనే ఉంటుందిలే అన్నాకనే మా పిన్నీ వాళ్ళూ ఈ పెళ్ళికి ఒప్పుకున్నారు. ఆవిడ ఇక్కడ వంట చేసుకుంటాననంటే వాళ్ళకి నామోషీగా ఉండదా? తెలివితక్కువగా ఈ సంబంధం పోగొట్టుకోవద్దని శాంతమ్మకు నచ్చచెప్పు..."

"చెప్పను. శాంతమ్మకు ఆత్మాభిమానం ఎక్కువ. ఇలాంటి సంబంధానికి ఒప్పుకోదు. తల్లి గురించి తెలియకూడదనే షరతు ఉంటే.. ఎంత గొప్ప సంబంధమైనా సరే రంగాయే కాదు, ఏ కొడుకూ అంగీకరించడు! ఒకవేళ ఎవరైనా అంగీకరిస్తే.. అలాంటి వాడిని 'ఛీ' కొట్టాల్సిందే!"

నా మాటలు రజితకు ఎంత కోపాన్ని తెప్పించాయో ఎర్రబడిన తన మొహాన్ని చూస్తుంటే తెలుస్తోంది! ఎందుకో గానీ ఆవేశాన్ని వెళ్ళగక్కకుండా కొంచెం తమాయించుకోవటానికి ప్రయత్నిస్తున్నట్లుగా కనిపించింది.

ఇంతలో, చిన్నత్తయ్య మాటలు వినిపించి ఇద్దరం వెనక్కి తిరిగి చూశాం.

"లాయరు రామబ్రహ్మంగారు, భవానీ గారు వచ్చారు. మీ అమ్మగారి నగలట... మీ నాన్నగారు వాళ్ళతో పంపించారు..."

ముందు చెప్పకుండా... ఇంత హఠాత్తుగా ఎందుకు పంపించినట్లు...?! ఆశ్చర్యంగా ఉంది. లేచి నిలబడ్డాను.

రజిత వ్యంగ్యంగా నవ్వింది. "మీ అమ్మగారికి... బడిపంతులు భార్యగారికి ఎన్ని నగలున్నాయని ప్రత్యేకంగా పంపించారో..! ఆ వజ్రవైఢూర్యాల నగల్ని .. పద.. చూద్దాం..." అంది.

మాటల్లోకి వెళ్ళగ్రక్కకుండా అప్పటి వరకూ బిగబట్టి ఆపుకున్న కోపాన్ని నన్ను ఎగతాళి చేయటానికి ఇలా ఉపయోగించుకుంది.

నేనేం మాట్లాడలేదు గానీ చిన్నత్తయ్య మాత్రం నిరసనగా చూస్తూ, "అవును... నువ్వు చూడాల్సిందే...రా..." అన్నారు.

హాలు పక్కనుండే ఆఫీసు రూములో అంకుల్ వాళ్ళు, అత్తయ్య కూర్చుని ఉన్నారు.

భవానీ ఆంటీ చిరునవ్వుతో లేచి వచ్చి నన్ను ఆప్యాయంగా పట్టుకుని తన పక్కనే కూర్చోబెట్టుకుంటూ "మీ కోడలు సంగీతం క్లాసులో నా శిష్యురాలు... ఇంగ్లీషు క్లాసులో నాకు గురువుగారు..." అన్నారు.

అత్తయ్య చిరునవ్వుతో చూశారు.

ఆంటీ నాకు మెల్లగా వివరం చెప్పారు.

విష్ణు వైజాగ్ వస్తున్నారని తెలిసి నాన్నగారూ వచ్చారు. తాతగారి ద్వారా వచ్చిన ఆస్తిపాస్తుల వివరాలు చెప్పి సంబంధించిన డాక్యుమెంట్స్ అన్నీ అప్పగించారు.

అంకుల్, ఆంటీ వాళ్ళ ఫ్రెండ్ సిఐగారు ఈ ఊరికే పెళ్ళికి బంధువులింటికి వస్తున్నారట. సిఐగారు కూడా ఉండటంతో సెక్యూరిటీ ఉంటుందని నాన్నగారు లాకర్‌లోని నగల్ని కూడా వాళ్ళతో పంపించారట.

ఒక సూట్‌కేస్ తెరిచి అంకుల్ తన షర్టు జేబులో ఉన్న కాగితం తీసి లిస్టు చదువుతూంటే ఆంటీ అన్నీ తీసి చూపించారు. మొదటిసారిగా నేనూ అప్పుడే చూశాను.

వడ్డాణం, వంకీలు, రకరకాల హారాలు, నెక్లెసులు, గాజులు ఏమిటేమిటో ఉన్నాయి. తను ఎగతాళిగా అన్న మాట నిజంగానే నిజమైనట్లుగా... ధగధగలాడుతున్న వజ్రాల నగల్ని చూసేసరికి రజితకు మతిపోయినట్లుగానే ఉంది! కళ్ళింత చేసుకొని విభ్రాంతిగా చూసింది.

లిస్టు అంతా చదివాక అందినట్లుగా నాతో సంతకం చేయించుకున్నారు.

ఆ నగల్ని చూస్తుంటే అప్రయత్నంగా నా కళ్ళు చెమ్మగిల్లాయి. మనసు ఆర్ద్రంగా 'అమ్మా...' అని పలవరించింది!

నగలపైన అయినా, వేరేవాటి పైనా అయినా, ఇష్టం ఉండొచ్చుగానీ వ్యామోహం కూడదు! నగలే అమ్మ జీవితంలో లేనిపోని సమస్యల్ని సృష్టించాయి. మనసు మార్చుకున్న సమయంలో కన్న తండ్రి అహంకారానికి అమ్మ జీవితం బలి అయిపోయింది!

భారమైన నిట్టూర్పు వచ్చింది.

విష్ణుకి ఇవ్వటం కంటే అత్తయ్యకు తెలియజేసి అందివ్వటమే పద్ధతని నాన్నగారు అనటంతో ఇలా వచ్చామని ఆంటీ అన్నారు.

కాఫీ, ఫలహారాలయ్యాక వెళ్ళేటప్పుడు కారు ఎక్కుతూ భవానీ ఆంటీ నాతో "ఎందుకోగానీ కొందర్ని చూడగానే గౌరవభావం కలుగుతుంది! మీ అత్తగార్ని చూస్తే నాకు సరిగ్గా అలాగే అనిపించింది! అంతా సంస్కారవంతులుగా, మంచివాళ్ళుగా అనిపించారు. నువ్వు అదృష్టవంతురాలివి!" అనటంతో నాకూ ఆనందంగా అనిపించింది.

* ❀ *